సాక్షి ఒడిశా
శనివారం । 20 । జూలై । 2024





**శ్రీమందిరం ఆదాయం లెక్కింపు**

| | |
|---|---|
| నగదు | రూ. 5,86,330 |
| బంగారం | 1 గ్రాము 150 మిల్లీ గ్రాములు |
| వెండి | 71 గ్రాముల 850 మిల్లీ గ్రాములు |

– భువనేశ్వర్/పూరీ



**నల్లనయ్య నీలాద్రి విజే**

శ్రీజగన్నాథుని నవ దినాత్మక యాత్ర శుక్రవారంతో ముగిసింది.

- 8లో



**ఒడిస్సా అభివృద్ధే లక్ష్యం**

ఒడిస్సా అభివృద్ధే బీజేపీ లక్ష్యమని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు.

- 8లో

## న్యూస్‌రీల్

### అత్యాచారం ఆరోపణలతో యువకుడి అరెస్టు

**జయపురం:** ఒక యువతిపై అత్యాచారం ఆరోపణలతో యువకుడిని జయపురం మహిళా పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టైన యువకుడు ధమంజొడి పోలీసుస్టేషన్ పరిధి మతలాపుట్ గ్రామానికి చెందిన గంగులి బెనియగా మహిళా పోలీసుస్టేషన్ అధికారి వెల్లడించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచామని, బెయిలు మంజూరు కాకపోవడంతో జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూడేళ్ల క్రితం కొరాపుట్ సదర్ పోలీసుస్టేషన్ పరిధిలోని ఒక మైనర్ బాలిక( ప్రస్తుతం ఆమెకు 20 ఏళ్లు)కు గంగులితో పరిచయం ఏర్పడింది. అనంతరం వారి పరిచయం ప్రేమగా మారింది. అయితే 2022 ఏప్రిల్‌లో బాలికపై యువకుడు అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణ. అనంతరం 2023 ఆగస్టులో ఆమెను పెళ్లి చేసుకుంటానని చెప్పి యువకుడు తన ఇంటికి తీసుకెళ్లాడని తెలిపారు. అతడితో ఇంటికి వెళ్లిన కొంతకాలం తర్వాత యువతిని అబ్బాయి కుటుంబ సభ్యులు చంపుతామని భయపెడుతూ హింసించారన్నారు. దీంతో ఆమె ప్రాణ భయంతో కన్నవారింటికి వెళ్లిపోయింది. అనంతరం తన సమస్య పరిష్కరించాలని కోరుతూ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేసి ఆమెకు వైద్య పరీక్షలు జరిపించి, వాగ్మూలం రికార్డు చేసినట్లు పోలీసు అధికారి వెల్లడించారు. మహిళా పోలీసుస్టేషన్ ఎస్‌ఐ శకుంతలా దేవి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### బైకు చోరీ కేసులో ముగ్గురు అరెస్టు



అరెస్టైన నిందితులను చూపిస్తున్న పోలీసులు

**రాయగడ:** బైకు చోరీ కేసులో ముగ్గురు నిందితులను సదరు పోలీసులు గురువారం సాయంత్రం అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో కె. కృష్ణారావు, డి.భరత్, కార్తీక్ నాగ్‌లు ఉన్నట్లు ఐఐసీ కేకేబీకే కుహరో తెలియజేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఈనెల 2వ తేదీన స్థానిక రామకృష్ణ నగర్‌లో నివాసముంటున్న వంశీధర్ సాదంగి అనే వ్యక్తికి సంబంధించిన బైక్ చోరీకి గురయ్యింది. ఈ మేరకు ఆయన స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈక్రమంలో గురువారం సాయంత్రం పట్టణంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో కె.కృష్ణారావు ఒక నంబర్ లేని ద్విచక్ర వాహనాన్ని నడుపుతుండగా పోలీసులు పట్టుకున్నారు. అనంతరం అతడిని వివరాలు అడగగా అది తన సొంత బైక్ కాదని, స్నేహితుని వద్ద నుంచి తీసుకొచ్చానని పోలీసులకు చెప్పాడు. దీనిపై పోలీసులకు అనుమానం రావడంతో స్వాధీనం చేసుకుని పరిశీలించగా, ఈనెల 2వ తేదీన ఫిర్యాదు చేసిన వంశీధర్‌కు చెందిన బైకుగా తెలిసింది. దీంతో కృష్ణారావును పోలీసులు అరెస్టు చేసి విచారించారు. విచారణలో డి.భరత్, కార్తీక్ నాగ్‌లు కూడా దొంగతనంలో ఉన్నట్లు తేలడంతో ముగ్గురినీ కోర్టుకు తరలించారు.

### పురాతన నాణెం చోరీకి యత్నం

- నలుగురు నిందితులు అరెస్టు



అరెస్టైన నిందితులు

**మల్కన్‌గిరి:** జిల్లాలో పురాతన నాణెం దొంగలించేందుకు యత్నించిన కేసులో నలుగురు నిందితులను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మల్కన్‌గిరి సమితి తండకి గ్రామంలోని నారాయణ్ అనే వ్యక్తి ఇంట్లో పురాతన హనుమాన్ బొమ్మ కలిగినటువంటి నాణెం ఉంది. దానిని అదే గ్రామానికి చెందిన టుకు కరణ్ అనే వ్యక్తి సొంతం చేసుకోవాలని పన్నాగం పన్నాడు. ఈ మేరకు కాదబాహల్ గ్రామానికి చెందిన పండు సోడి అనే వ్యక్తి సాయం కోరారు. పండు సోడి ఈ విషయాన్ని జయపురంలో ఉన్నటువంటి దాము, శివ హరిజన్‌కు తెలిపాడు. దీంతో ఈ నలుగురు కలిసి నాణెం దొంగతనం కోసం ప్లాన్ వేశారు. వీరితో కలిసి మరో ముగ్గురిని తోడుగా తీసుకొని గురువారం రాత్రి మల్కన్‌గిరి చేరుకున్నారు. అనంతరం రాత్రి 3 గంటల సమయంలో 3 బైక్‌ల మీద ఏడుగురు వ్యక్తులు వచ్చి, ఇంట్లోకి వెళ్తుండగా గమనించిన నారాయణ్ కేకలు వేయడంతో గ్రామస్తులు దొంగలను వెంబడించారు. దొంగల్లో అంబగూడ గ్రామానికి చెందిన జగన్నాథ్ హరిజన్, కూంజాబ్ హరిజన్, పండు సోడి, టుకూ కరణ్‌లను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. మిగతావారు పరారయ్యారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, దర్యాప్తు చేస్తున్నారు. అయితే నాణెం విలువ సుమారు రూ.5 కోట్లు ఉంటుందని తెలుస్తోంది.

# రాష్ట్రానికి రెడ్ అలెర్ట్

- అతిభారీ వర్షాలు కురవనున్నట్లు ఐఎండీ హెచ్చరిక
- గంటకు 65 కి.మీ వేగంతో గాలులు
- ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం



బంగాళాఖాతంలో అల్పపీడనం కదలిక చిత్రం



**భువనేశ్వర్:** అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో గాలులతో అతిభారీ వర్షం కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ శుక్రవారం తెలియజేసింది. వాయువ్య, ఆ ప్రాంతానికి ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్ప పీడనం ఏర్పడి చురుకుగా కదులుతుండడంతో ఈ పరిస్థితి నెలకొన్నట్లు పేర్కొంది. అల్పపీడనం శనివారం తెల్లవారుజామున పూరీ సమీపంలో తీరాన్ని దాటే అవకాశం ఉందని తెలియజేశారు. అతి భారీ వర్షాల వలన ఆకస్మిక వరదలను ప్రేరేపించే పరిస్థితులు పొంచి ఉన్నాయని హెచ్చరించింది.

**అల్పపీడన గమనం**

శుక్రవారం ఉదయం 8.30 గంటల సమయంలో వాయువ్య, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఒడిశా మరియు పరిసర ఉత్తర ఆంధ్రప్రదేశ్ అక్షాంశం 19.2 డిగ్రీల ఉత్తర, రేఖాంశం 86.2 డిగ్రీల తూర్పు తీరాల మీదుగా అల్పపీడనం కేంద్రీకృతమై ఉంది. పూరీకి ఆగ్నేయంగా 70 కి.మీ దూరంలో, గోపాల్‌పూర్‌కు తూర్పున 130 కిలోమీటర్లు, దక్షిణం వైపు 130 కిలోమీటర్లు దూరం పారాదీప్ ప్రాంతానికి ఆగ్నేయంగా, కళింగపట్నం (ఆంధ్రప్రదేశ్)కి తూర్పు – ఈశాన్యంగా 240 కిలోమీటర్లు దూరంలో అల్ప పీడనం బలం పుంజుకుంటుంది. ఇది శనివారం తెల్లవారుజామున వాయువ్య దిశగా పయనించి అల్పపీడనంగా పూరీ సమీపంలో ఒడిశా తీరం దాటే అవకాశం ఉంది. ఆ తర్వాత ఒడిశా, ఛత్తీస్‌గఢ్ మీదుగా పశ్చిమ వాయువ్య దిశగా పయనించి, తదుపరి 24 గంటల్లో క్రమంగా బలహీనపడుతుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రత్యేక బులెటిన్‌లో పేర్కొంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఈనెల 23 వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

**అతిభారీ వర్షాలు**

కొరాపుట్, మల్కన్‌గిరి, కలహండి, నవరంగ్‌పూర్ జిల్లాల్లో ఒకటి లేదా రెండు చోట్ల భారీ నుంచి అతి భారీగా 20 సెంటీ మీటర్లు వరకు వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉంది. ఈ మేరకు వాతావరణ శాఖ ముందస్తు సమాచారం వెల్లడించి రెడ్ అలెర్ట్ జారీ చేసింది.

**ఆరెంజ్ అలెర్ట్**

కంధమాల్, బౌధ్, బొలంగీర్, నువాపడా, రాయగడ, గంజాం, గజపతిలో ఒకటి లేదా రెండు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షపాతం (7 నుండి 20 సెం.మీ.) సూచనతో ఆరెంజ్ హెచ్చరిక జారీ చేయబడింది. శనివారం ఉదయం 8.30 గంటల వరకు పూరీ, ఖుర్దా, నయాగడ్, కటక్, కేంద్రాపడా, బాలాసోర్, భద్రక్, జాజ్‌పూర్, సోన్‌పూర్, సంబల్‌పూర్, అంగుల్, ఢెంకనాల్, మయూర్‌భంజ్, కెంజొహర్, జగత్‌సింగ్‌పూర్‌లలో ఒకటి లేదా రెండు చోట్ల భారీ వర్షపాతం (7 నుండి 11 సెం.మీ.) ఉంటుందని ఐఎండీ అంచనా.

**సముద్రంలో అలజడి**

ఈ వ్యవధిలలో సముద్రంలో అలజడి వాతావరణం నెలకొని ఉంటుంది. మత్స్యకారులు ఈనెల 20 వరకు సముద్రంలో వేటకు వెళ్లకూడదని హెచ్చరికలు చేశారు. ఎవరైనా వేటకు వెళ్తే చర్యలు తప్పవన్నారు.

**వరదలపై అప్రమత్తం**

వర్షాలతో రాష్ట్రంలో ఆకస్మిక వరదలు పరిస్థితి నెలకొనే అవకాశం ఉందని ఐఎండీ అప్రమత్తం చేసింది. లోతట్టు ప్రాంతాల్లో ముంపు, పంట పొలాల మునక, దుర్బలమైన కొండ ప్రాంతాల్లో బురద, కొండచరియలు విరిగిపడటం వంటి సంఘటనల పట్ల వాతావరణ శాఖ ముందస్తుగా హెచ్చరించింది. కచ్చా రోడ్లకు నష్టం, బలహీనమైన కచ్చా ఇండ్ల గోడలు కూలిపోవడం, అండర్‌పాస్ రోడ్డు మార్గంలో జల దిగ్బంధం, దృశ్యమాన్యత తగ్గడం వంటి పరిస్థితులతో పలు ప్రాంతాల్లో వాహనాలు వగైరా రవాణాకు అంతరాయం ఏర్పడే అవకాశం కూడా ఉందని పేర్కొంది.

**లోటు వర్షపాతం**

ఈ ఏడాది రుతు పవనాలు ముందస్తుగా రాష్ట్రంలోకి వచ్చాయి. కానీ ఊహించిన మేరకు వర్షపాతం నమోదు కాకపోవడం కలవరపరుస్తోంది. ఈ ఏడాది జూన్ ఆరంభం నుంచి ఈనెల 19 శుక్రవారం వరకు దాని సగటు సాధారణ వర్షపాతం 405.5 మిల్లీ మీటర్లు కాగా, ఇప్పటివరకు సమగ్ర వర్షపాతం 303.6 మిల్లీ మీటర్లకు పరిమితం అయింది. ఈ వ్యవధిలో 12 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదు అయింది. మిగిలిన 18 జిల్లాల్లో లోటు వర్షపాతం కొనసాగుతోంది.

## బీజేడీ పార్లమెంటరీ పార్టీ చైర్మన్‌గా నవీన్ పట్నాయక్



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

**భువనేశ్వర్:** బీజేడీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ బిజూ జనతా దళ్ పార్లమెంటరీ పార్టీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. స్థానిక నవీన్ నివాస్‌లో శుక్రవారం జరిగిన బీజేడీ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న 9 మంది రాజ్యసభ ఎంపీలు నవీన్ పట్నాయక్‌ను బీజేడీ పార్లమెంటరీ పార్టీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అతని మార్గదర్శకత్వంలో పని చేయాలని నిర్ణయించుకున్నారు. రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణ కోసం ఎగువ సభ లోపల, బయట పోరాడాలని ఎంపీలకు అధ్యక్షుడు ఆదేశించారు.

# త్వరలో ఆభరణాల లెక్కింపు

- తనిఖీ కమిటీ ఛైర్మన్ జస్టిస్ విశ్వనాథ్ రథ్

**భువనేశ్వర్:** శ్రీమందిరం రత్న భాండాగారంలోని ఆభరణాల లెక్కింపును త్వరలో చేపట్టనున్నట్లు రత్న భాండాగారం ఉన్నత స్థాయి తనిఖీ కమిటీ చైర్మన్ జస్టిస్ విశ్వనాథ్ రథ్ శుక్రవారం తెలిపారు. భాండాగారంలో దీర్ఘకాలంగా పదిలపరిచిన నగలు, ఆభరణాలు ఇతరేతర అమూల్య సంపద లెక్కింపు, జాబితా తయారీ సన్నాహాలు ప్రారంభమవుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు ప్రకారం భాండాగారం వెలుపలి, లోపలి గదులు తెరిచారు. వీటిలో భద్రపరిచిన రత్న సంపదని యథాతథంగా తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌కి తరలించారు. గర్భాలయం పరిసరాల్లో ఖొట్టొసెజ్జొ గదిని తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌గా పరిగణిస్తున్నారు.

**నిధిలో ఆయుధాలు గుర్తింపు**

రత్న భాండాగారం లోపలి గది తెరవడంతో రాజుల కాలం నాటి యుద్ధ సామగ్రి దృష్టికి వచ్చింది. అయితే వీటిని ఏ లోహంతో తయారు చేశారు, వాటి చరిత్ర పూర్వాపరాల వివరాలు స్పష్టమవ్వాల్సి ఉందని జస్టిస్ విశ్వనాథ్ రథ్ పేర్కొన్నారు. కాగా ఉన్నత స్థాయి పర్యవేక్షక కమిటీ ఆధ్వర్యంలో రత్న భాండాగారం మరమ్మతులను భారత పురావస్తు శాఖ(ఏఎస్‌ఐ) నిర్వహించనుంది. వీరి సౌలభ్యం కోసం వెలుపలి, లోపలి గదుల్లో నగలు, ఆభరణాలను తొలగించి అప్పగించారు. అత్యాధునిక శక్తివంతమైన వైజ్ఞానిక పరికరాలతో రత్న భాండాగారం క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన పనులు చేపడతారు. ఈ ప్రక్రియ ముగిసిన తర్వాత బయటకు తీసిన ఆభరణాల పరిశీలన, లెక్కింపు వగైరా పనులు చేపడతారు. అంతా ముగిసిన తర్వాత వీటిని యథాతథంగా రత్న భాండాగారంలోకి మరలా తరలిస్తారు.

### ప్రజా ఫిర్యాదుల విచారణ రద్దు

**భువనేశ్వర్:** ఈనెల 22వ తేదీ సోమవారం జరగాల్సిన సీఎం ప్రజా ఫిర్యాదుల విచారణ కార్యక్రమం రద్దు చేశారు. ఆరోజు నుంచి 17వ శాసనసభ తొలి సమావేశాలు ప్రారంభమవ్వనున్న నేపథ్యంలో తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు అధికారులు శుక్రవారం వెల్లడించారు.

# ప్రాణాలు తీస్తున్న మలేరియా

- బొడొరాయిసింగిలో విద్యార్థి మృతి



చికిత్స పొందుతూ మృతి చెందిన చందు కొలక

**రాయగడ:** జిల్లాలోని ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలల్లో మలేరియా మహమ్మారి జడలు విప్పుతోంది. వ్యాధి బారినపడిన విద్యార్థులు ఆస్పత్రుల పాలవుతున్నారు. జిల్లాలో ఇప్పటికే సుమారు 500 మంది ఈ వ్యాధి బారినపడిన వారు ఉండగా, తాజాగా సదరు సమితి పరిధిలోని బొడొరాయిసింగ్ ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న చందు కొలక (11) అనే విద్యార్థి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. దీంతో మృతుల సంఖ్య రెండుకు చేరుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తడమ పంచాయతీలోని కొలింగి గ్రామానికి చెందిన చందు కొలక అనే విద్యార్థి ఈనెల 13వ తేదీన బొడొరాయిసింగ్ ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతిలో చేరాడు. హాస్టల్‌లో ఉంటున్న చందు ఈనెల 15వ తేదీన అస్వస్థతకు గురయ్యాడు. దీంతో ఆశ్రమ నిర్వాహకులు చందుని పరీక్షించగా మలేరియా సోకినట్లు గుర్తించారు. సమీపంలోని జిమిడిపేట పీహెచ్‌సీకి చికిత్స కోసం తరలించారు. జ్వరం తీవ్రత తగ్గుముఖం పట్టకపోవడంతో ఈనెల 16వ తేదీన జిల్లా కేంద్రాస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి వైద్యులు వెంటనే కొరాపుట్ రిఫర్ చేశారు. అనంతరం మరింత మెరుగైన చికిత్స కోసం ఈనెల 17వ తేదీన బరంపురంలోని ఎంకేసీజీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 17వ తేదీ రాత్రి చందు మృతి చెందాడు. ఇదేవిధంగా కొద్దిరోజుల క్రితం దుర్గాపాడు ఆశ్రమ పాఠశాలలో మలేరియా వ్యాధి బారినపడి ఆరో తరగతి విద్యార్థి మృతి చెందినట్లు సమాచారం. ఆశ్రమ పాఠశాలల్లో మలేరియా వ్యాధి వ్యాపించడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్తున్నట్లు సమాచారం.

# ఉమ్మిరిలో తుపాకీల మోత

- నాటు తుపాకీలతో దాడులు చేసుకున్న రెండు వర్గాలు



పోలీసులు స్వాధీనం చేసుకున్న తూటా



గాయపడినవారిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం



మహిళ కాలికి గాయమై రక్తం కారుతున్న దృశ్యం

**జయపురం:** సమితిలోని ఉమ్మిరి గ్రామంలో రెండు వర్గాల మధ్య జరిగిన గొడవలో తుపాకీల మోత మోగింది. కాళ్లల్లో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడినవారిలో బాలా ఖోశ్ల, మింటు బారిక్, సంతోష్ బారిక్‌లు ఉన్నట్లు సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి వెల్లడించారు. గాయపడిన వారిని జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించినట్లు వెల్లడించారు. వారిలో మింటు, సంతోష్ బారిక్‌ల పరిస్థితి విషమంగా ఉండడంతో కొరాపుట్ సాహిద్ లక్ష్మణ్ నాయక్ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి ఇరువర్గాల్లో కొందిమందిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిపారు.

**ఇదీ విషయం**

పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గురువారం రాత్రి జయపురం ఎయిర్‌పోర్టు రోడ్డులో ఏదో కారణం వలన గ్రామానికి చెందిన రెండు యువకుల గ్రూపుల మధ్య వివాదం తలెత్తింది. దీంతో ఈ గ్రూపుల్లో యువకులు పరస్పరం దాడులు చేసుకున్నారు. అనంతరం రాత్రి 9 గంటల సమయంలో గ్రామానికి చేరుకొని, మారణాయుధాలతో హల్‌చల్ చేశారు. తదుపరి ఇళ్లలోని నాటు తుపాకీలు తీసుకొచ్చి కాల్పులు జరిపారు. ఈ గొడవలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఘర్షణపై పోలీసులకు సమాచారం అందడంతో జయపురం సబ్ డివిజన్ పోలీసు అధికారి అంకిత కుమార్ వర్మ, గగణాపూర్ పోలీసు పంటి అధికారి కిశోర్ బారిక్, సబ్ ఇన్‌స్పెక్టర్లు శిరీష్ మహాపాత్రో, ప్రమోద్ కుమార్ పాణి, బరిణిపుట్ పోలీసు పంటి అధికారి కామాక్ష ప్రసాద్ బిశాయి, అంబాగుడ పోలీసు పంటి అధికారి మనువ బిడిక, ఏఎస్‌ఐ బసంతి నాయిక్ తదితరులు గ్రామానికి చేరుకున్నారు. గ్రామంలో ఎటువంటి ఉద్రిక్త వాతావరణం ఏర్పడకుండా సాయుధ పోలీసులను దింపామని పోలీసు అధికారి ఈశ్వర్ తండి వెల్లడించారు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు రెండు కేసులు నమోదు చేసి కొంతమందిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిపారు. నిందితులు పేల్చిన తుపాకీ తూటాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.




నోరూరుంచే రసగుల్ల రాష్ట్ర సంస్కృతిలో ఒక భాగమై విశేష ఆదరణ పొందుతోంది. ఏటా శ్రీజగన్నాథుని రథయాత్ర చివరి రోజుని రాష్ట్ర ప్రజలు రసగుల్ల దినోత్సవంగా జరుపుకుంటారు. దీనిలో భాగంగా పూరీ సాగరతీరంలో ప్రసిద్ధ సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ సైకత శిల్పంతో శుభాకాంక్షలు తెలిపాడు. – భువనేశ్వర్

# నిధులు వినియోగిస్తేనే అభివృద్ధి సాధ్యం

- కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి
- వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీ సప్తగిరి, వేదికపై ఎమ్మెల్యే కద్రక తదితరులు



సమావేశంలో పాల్గొన్న సర్పంచ్‌లు, సమితి సభ్యులు

**రాయగడ:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు మంజూరు చేస్తున్న నిధులను సక్రమంగా వినియోగిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక అన్నారు. స్థానిక సమితి కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మంజూరు చేస్తున్న నిధులు సకాలంలో వినియోగించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దమని మండిపడ్డారు. గ్రామాలకు రహదారి సౌకర్యాలు మెరుగుపర్చాలని సూచించారు. తాగునీటి సమస్యపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. ప్రతీ గ్రామంలోనూ ఇప్పటికీ తాగునీటి ఎద్దడి కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు ప్రాధాన్యమివ్వాలన్నారు.

**ప్రజల కోసం పనిచేయాలి**

ఎంతో నమ్మకంతో మనల్ని గెలిపించిన ప్రజల కోసం ప్రజా ప్రతినిధులు పనిచేయాలని రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక సూచించారు. సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజల్లో ఆరోగ్య కార్యకర్తలు చైతన్యం తీసుకురావాలని సూచించారు. మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో నియంత్రణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. సమష్టిగా పని చేసి గ్రామాలను అభివృద్ధి చేద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో సమితి అధ్యక్షురాలు టున్ని హుయిక, వైస్ చైర్మన్ హరప్రసాద్ హెప్రుక, బీడీవో అమూల్య కుమార్ సాహు, జిల్లా పరిషత్ సభ్యురాలు సంధ్యా పులక తదితరులు పాల్గొన్నారు.

**బిసంకటక్‌లో...**

జిల్లాలోని బిసంకటక్ సమితి కార్యాలయంలో సమీక్ష సమావేశం శుక్రవారం జరిగింది. సమితి అధ్యక్షురాలు సదా హుయిక అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బిసంకటక్ ఎమ్మెల్యే నీలమాధవ హికక ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా హికకకు స్వాగతం పలికిన అధ్యక్షురాలు సదా హుయిక గతేడాది సమితిలో జరిగిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఎమ్మెల్యే నీలమాధవ మాట్లాడుతూ మౌలిక సౌకర్యాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి కేంద్రీకరించాలన్నారు. రహదారి, విద్యుత్, తాగు, సాగునీటి సౌకర్యాలను కల్పించేందుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సమావేశంలో బీడీవో సదాశివ నాయక్, వైస్ చైర్మన్ దేవి ప్రసాద్ పట్నాయక్, ప్రజారోగ్య శాఖ అధికారి డాక్టర్ జ్యోత్స్నారాణి మహారాణ తదితరులు పాల్గొన్నారు.



బిసంకటక్‌లో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

## క్లుప్తంగా

### అడ్వకేట్ జనరల్‌గా పీతాంబర్ ఆచార్య



పీతాంబర్ ఆచార్య

**భువనేశ్వర్:** రాష్ట్ర నూతన అడ్వకేట్ జనరల్‌గా పీతాంబర్ ఆచార్య శుక్రవారం నియమితులయ్యారు. ఆయన రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయవాది. రాష్ట్ర గవర్నర్ ఆమోదం మేరకు ఈ నియామకం జరిగింది. నియామకం తక్షణమే అమలులోకి వచ్చినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### కౌన్సిలర్ ఇంట్లో దొంగతనం



ఇంట్లో చిందరవందరగా పడివేసిన సామన్లు

**జయపురం:** మున్సిపాలిటీ పరిధి 22వ వార్డు కౌన్సిలర్ విష్ణువర్ధన్ రెడ్డి తల్లి నివసిస్తున్న ఇంట్లో గురువారం రాత్రి దొంగతన జరిగింది. ఈ మేరకు పట్టణ పోలీసుస్టేషన్‌లో ఆయన శుక్రవారం ఫిర్యాదు చేశారు. తన తల్లి ఊరు వెళ్లడంతో పైలాసాహిలో ఉన్న ఇంట్లో దొంగతన జరిగినట్లు పేర్కొన్నారు. దుండగులు వెండి సామానుతో పాటు 3 సెల్‌ఫోన్లు, రూ.4,500 నగదు దొంగిలించారని వెల్లడించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### బీపీఐఏపై గ్లోబల్ మైక్రోసాఫ్ట్ అంతరాయం ప్రభావం

**భువనేశ్వర్:** ప్రపంచవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ అంతరాయం ప్రభావం స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం (బీపీఐఏ) సేవలను ప్రభావితం చేసింది. ప్రధాన సాంకేతిక లోపం కారణంగా ఈ విమానాశ్రయంలో బుకింగ్ మరియు చెక్-ఇన్ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. కంప్యూటర్లు పని చేయకపోవడంతో ప్రయాణికులకు మాన్యువల్ సపోర్టు, సేవలు అందించి సర్దుబాటు చేశారు. దీంతో విమానాలు టేకాఫ్ మరియు ల్యాండింగ్ ఆలస్యం అయ్యాయి.

### గోప్యంగా ఆశీలు వేలంపాట ఖరారు

**ఆమదాలవలస:** ఆమదాలవలస మున్సిపాలిటీలో 7వ వార్డు చింతాడ గ్రామంలో ప్రతి శనివారం నిర్వహించే వారపు సంతలో ఆశీలు వసూళ్లకు వేలంపాటను శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ జి.రవి ఆధ్వర్యంలో అధికారులు గోప్యంగా నిర్వహించారు. కేవలం ఇద్దరు వ్యక్తులు, వారి అనుచరులు మరో ఆరుగురు వ్యక్తులతో కలిసి వేలంపాటను పూర్తి చేసేశారు. పాటలో చింతాడ గ్రామానికి చెందిన బోర హరనాథ్, గుండ వెంకటరమణ పాల్గొన్నారు. మొదటగా సర్కారు వారి పాట రూ. 7,07,500 లతో ప్రారంభించగా బోర హరనాథ్ రూ. 7,19,500కు పాటను దక్కించుకున్నారు. 2022-23, 2023-24 సంవత్సరాల్లో సంత వేలం పాటకు ఎవరూ ముందుకు రాకపోవడంతో పురపాలక సిబ్బంది చింతాడ సంత ఆశీళ్లను వసూలు చేసేవారు. ఈ ఏడాది కూడా మార్చిలో నిర్వహించిన వేలం పాటలో ఎవరూ పాల్గొనక పోవడంతో ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి పురపాలక సచివాలయ సిబ్బందే సంత ఆశీలను వసూలు చేస్తున్నారు. వేలంపాట సందర్భంగా కమిషనర్ జి.రవి మాట్లాడుతూ వేలంపాట సమాచారాన్ని పురపాలక సంఘ ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు.

### జాబ్‌మేళాలో 53 మంది ఎంపిక

**శ్రీకాకుళం న్యూకాలనీ:** నిరుద్యోగ యువత తాము ఎంచుకున్న రంగంలో నైపుణ్యంతో పాటు అనుభవాన్ని గడించాలని జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలోని బలగ హాస్పటల్ జంక్షన్‌లో ఉన్న డీఎల్‌టీసీ శిక్షణ కేంద్రంలో శుక్రవారం సంగీత్ మొబైల్స్, కేఎల్ గ్రూప్ సంస్థల్లో ఖాళీలకు నిర్వహించిన జాబ్‌మేళాలో 53 మంది ఎంపికయ్యారు. తొలుత జాబ్‌మేళాను ప్రారంభించిన అనంతరం ఆమె నిరుద్యోగులకు పలు సూచనలు చేసి, అనేక అంశాలపై దిశానిర్దేశం చేశారు. సంగీత్ మొబైల్స్‌కు 32 మంది, కేఎల్ గ్రూప్‌కు 21 మంది ఎంపికైనట్లు చెప్పారు.

### మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య

**గార :** మండలంలోని పెద తూలుగు పంచాయతీలో భార్య కోప్పడిందన్న మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. చిన్నారావు అనే వ్యక్తికి భార్య చిన్నమ్మడు, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహమైంది. ఆటో నడుపుతూ జీవనం సాగించే చిన్నారావుకు మద్యం అలవాటు ఉంది. దీనికి తోడు బాగా అప్పులపాలైపోయాడు. ఈ విషయంలో బుధవారం చిన్నారావును భార్య కోప్పడటంతో మనస్తాపానికి గురై గురువారం ఉదయం 6.30 గంటలకు పురుగు మందు తాగేశాడు. కాసేపటికే వాంతులు కావడంతో వాసన గమనించిన భార్య, పిల్లలు ఆయనను రిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కె.కృష్ణప్రసాద్ చెప్పారు.



మదన మోహనుడి నీలాద్రి విజే



శ్రీమందిరం రత్న వేదికకు తరలి వెళ్తున్న శ్రీరామకృష్ణులు



రథం నుంచి దిగుతున్న సుదర్శనుడు

# నల్లనయ్య నీలాద్రి విజే

- మహాలక్ష్మికి దేవదేవుడి బుజ్జగింపు
- భద్రంగా మూల విరాట్టుల తరలింపు
- స్వామివారికి రసగుల్ల నైవేద్యం



స్వామి నివేదనకు మట్టి పాత్రల్లో సిద్ధం చేసిన రసగుల్ల

**భువనేశ్వర్:**

శ్రీజగన్నాథుని నవ దినాత్మక యాత్ర శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన నీలాద్రి విజే భక్తులను అత్యంత ఆనందోత్సాహాలతో ముంచెత్తింది. స్వామియాత్ర ఆద్యంతం ముచ్చట గొలిపించే ఘట్టాలతో మానవాళికి పలు సందేశాలను అందజేస్తుంది. నవ యవ్వన అలంకరణతో పక్షం రోజుల తర్వాత భక్తుల మధ్య ప్రత్యక్షమై కనుల పండువుగా యాత్రకు బయల్దేరిన స్వామివారు, తిరుగు ప్రయాణంలో దారి పొడవునా పలు చూడ ముచ్చట సన్నివేశాల మధ్య ప్రధాన పాత్రధారిగా సామాన్య సాంఘిక జీవన శైలి ప్రధానంగా కుటుంబ జీవనంలో తారసపడే పరిస్థితులను ప్రతిబింబింపజేయడం విశేషం. ఆత్మీయులతో అన్యోన్యత, దాంపత్యంలో చిరు కలహాలు వంటి ఆసక్తికరమైన వేడుకలతో అక్కడక్కడ ఆగుతూ శ్రీ మందిరం సింహద్వారం ముంగిటకు స్వామివారు చేరారు. ఈ ఆవరణలో రథాలపై కొలువుదీరి ఆరుబయట నిలువెత్తు బంగారుమూర్తిగా సర్వజీవ రాశులకు దర్శన భాగ్యం కల్పించాడు. అశరీర వర్గాల మోక్షం కోసం అధర పాణకం అందజేసి రత్న వేదికకు చేరేందుకు సమాయత్తం అయ్యాడు.

**అలకబూనిన శ్రీమహాలక్ష్మి**


ఏటా పవిత్ర ఆషాఢ శుక్ల త్రయోదశి తిథి పురస్కరించుకుని శ్రీక్షేత్రంలో జరిగే నీలాద్రి విజే ప్రత్యేకమైనది. సింహద్వారం గుండా 22 మెట్ల మార్గంలో వడివడిగా రత్న వేదికకు చేరబోయే క్షణంలో ప్రవేశద్వారం తలుపులు మూతబడ్డాయి. హేరా పంచమి నుంచి శ్రీమహాలక్ష్మి దేవదేవుడిపై అలకతో ఉంది. అడపా మండపంపై తనకు దర్శన భాగ్యం కల్పించకుండా విరహ వేదన రెట్టింపు చేసిన స్వామివారిని ఆట పట్టించేందుకు సింహద్వారం తలుపులు మూసి వేసింది. అయితే అమ్మవారు అలక వీడకుంటే సృష్టి కళ తప్పుతుంది. ఈ పరిస్థితి నివారించాలనే ఆద్య సేవకుడు పూరీ గజపతి మహారాజు స్వామివారు గుండిచా నుంచి తిరిగి వస్తుండగా తన భవనం ఎదురుగా లక్ష్మీనారాయణులను భేటీ చేయించి సాగనంపాడు. అయినా శ్రీమందిరం ప్రవేశానికి స్వామివారు దేవేరిని బుజ్జగించక తప్పలేదు. ప్రియ సఖిని బుజ్జగించడం తనకే సాధ్యమని స్వామి రుజువు చేసుకుంటాడు. ఈ సందర్భంగా ప్రియ సఖికి మధురమైన రసగుల్ల తినిపించి మైమరిపించి శ్రీమందిరం లోనికి ప్రవేశ అనుమతి పొంది ఠీవిగా లోనికి ప్రవేశించాడు. దీంతో శ్రీ జగన్నాథుని నవ దినాత్మక యాత్రకు తెర పడింది. రథయాత్రలో 3 రథాలపై మూల విరాటులతో ఉత్సవమూర్తులను వరుస క్రమంలో కిందకి దించి శ్రీమందిరంలోకి సురక్షితంగా తరలించారు.



నందిఘోష్ రథంపై శ్రీజగన్నాథునికి రసగుల్ల నివేదన

### • భేటీ మండపం

నవ దినాత్మక యాత్ర ముగించుకుని తిరిగి శ్రీమందిరానికి స్వామివారి ఆగమనం కోసం శ్రీమహాలక్ష్మి నిరీక్షిస్తుంది. నీలాద్రి విజే రోజున నందిఘోష్ రథం పైనుంచి భారీ పుష్ప మకుటంతో ఊగిసలాడుతూ దిగుతున్న స్వామివారిని కనులారా తిలకించేందుకు శ్రీమహాలక్ష్మి అల్లంత దూరం నుంచి చూస్తూ ఉంటుంది. దేవి నిరీక్షించే ఈ మండపం భేటీ మండపంగా ప్రతీతి. ఈ మండపం దివ్య సింగ్ దేవ్ క్రీ.శ.1677-1716 కాలంలో నిర్మించినట్లు చారిత్రాత్మక కథనం. శ్రీమందిరం పోటు (పాకశాల) పరిసరాల్లో తూర్పు అభిముఖంగా ఈ మండపం నెలకొని ఉంది.



### రసగుల్ల గీతం ఆవిష్కరణ



రసగుల్ల గీతం ఆవిష్కరిస్తున్న దృశ్యం

**భువనేశ్వర్:** శ్రీజగన్నాథుని రథయాత్ర ఇటీవల కాలంలో సరికొత్త పుంతలతో మరింత ఆకర్షణీయంగా కొనసాగుతోంది. ఏటా నీలాద్రి విజే పురస్కరించుకుని రాష్ట్రంలో రసగుల్ల దినోత్సవం జరుపుకుంటున్నారు. తొలి రసగుల్ల దివస్ 2015 సంవత్సరం జూలై 30న జరిగింది. శ్రీజగన్నాథుని సంస్కృతి మరియు సంప్రదాయం రాష్ట్ర ప్రజల మనోభావాలతో ముడిపడి ఉంది. నీలాద్రి విజే పురస్కరించుకుని పూరీలో వేలాది మంది భక్తులు రథంపై అధిష్ఠించిన దేవతలకు రసగుల్ల నివేదించి స్నేహితులు, కుటుంబీకులు, బంధువులు, శ్రేయోభిలాషులకు ఇచ్చి పుచ్చుకున్న సన్నివేశాలు తారసపడ్డాయి. క్రమంగా రసగుల్ల దినం సామాజిక ప్రాచుర్యం సాధించింది.

**గీతం ఆవిష్కరణ**

ఈ ఏడాది నీలాద్రి విజే పురస్కరించుకుని రసగుల్ల గీతం ఆవిష్కరించారు. ప్రముఖ ఒడియా గీత రచయిత శుభ్రాంషు పండా సాహిత్యం, సంగీత దర్శకత్వంలో వినూత్నమైన రసగుల్ల గీతం చిత్రీకరించారు. శ్రీమందిర ప్రధాన పాలన అధికారి(సీఏఓ) డాక్టర్ అరవిందకుమార్ పాఢి ఈ గీతం ఆవిష్కరించారు. ఈ పాట జగన్నాథ సంస్కృతిని, రసగుల్లతో అల్లుకున్న ఆలయ సంప్రదాయాన్ని, జగన్నాథుడు మరియు ప్రియసఖి లక్ష్మీ మధ్య ఉన్న దైవ వైరుధ్యాన్ని వర్ణిస్తుంది.

### దేవదేవుడిని దర్శించుకున్న జేపీ నడ్డా

కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి, భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డా, రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్, ఎంపీ సంబిత్ స్వరాజ్ పూరీ బొడొదండొలో జరుగుతున్న పవిత్ర నీలాద్రి విజే సందర్భంగా శ్రీజగన్నాథుడిని శుక్రవారం దర్శించుకున్నారు. ఒడిశా శ్రేయస్సు మరియు అభివృద్ధి కోసం భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు.



### • అంధ బాలలకు సులభ దర్శనం

వార్షిక రథయత్ర పురస్కరించుకుని శ్రీజగన్నాథుడు అందరికి సమాన దర్శన భాగ్యం కల్పిస్తాడు. అందుకు నిలువెత్తు తార్కాణంగా శుక్రవారం రథాలపై దేవుళ్లను అంధ బాలలు సులభంగా దర్శించుకున్నారు. వీరి కోసం పూరీ జిల్లా పోలీసు యంత్రాంగం సౌకర్యాలు కల్పించింది. ప్రత్యేక సిబ్బంది సహకారంతో 37 మంది అంధ విద్యార్థులు రథయాత్ర చివరి రోజున రథాలపై దేవుళ్లని దర్శించుకున్నారు.



# ఒడిస్సా అభివృద్ధే లక్ష్యం

- కేంద్రమంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా

**భువనేశ్వర్:** ఒడిస్సా అభివృద్ధే బీజేపీ లక్ష్యమని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. రాష్ట్ర ప్రస్తుత రాజకీయ, సామాజిక సమస్యలపై శ్రీక్షేత్ర పురిలో బీజేపీ రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశం శుక్రవారం ప్రారంభమైంది. ఈ సమావేశం రెండు రోజులు పాటు నిరవధికంగా కొనసాగుతుంది. తొలిరోజు ఒడిశా అభివృద్ధి కోసం బీజేపీ ప్రభుత్వ ప్రణాళికపై చర్చ జరిగింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం 10 సంవత్సరాల సాఫల్యత మరియు రోడ్ మ్యాప్‌పై విస్తృతంగా చర్చించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డా, రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ రాష్ట్రంలో బీజేపీ పాలన లక్ష్యం అంశాలను ప్రస్తావించారు. అనంతరం కాంగ్రెస్‌పై జేపీ నడ్డా తీవ్రంగా మండిపడ్డారు. కాంగ్రెస్ రాజ్యాంగాన్ని కాపాడుతోందని అసత్య ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. నిజానికి కాంగ్రెస్ రాజ్యాంగాన్ని ఏనాడో ధ్వంసం చేసింది తప్ప దాన్ని ఏనాడూ రక్షించలేదన్నారు. 1.25 లక్షల మందిని జైల్లో పెట్టి కాంగ్రెస్ రాజ్యాంగాన్ని ఎలా కబళించిందో చెప్పడానికి ఎమర్జెన్సీ విధించడమే నిలువెత్తు ఉదాహరణగా పేర్కొన్నారు.

నవీన్ పట్నాయక్‌ని అడగండి, ఎమర్జెన్సీ సమయంలో బిజూ బాబుని కూడా జైలుకి పంపారని లంకె పెట్టారు. రాష్ట్రంలో 78 మంది ఎమ్మెల్యేలతో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని, 20 మంది బీజేపీ ఎంపీలను ఎన్నుకున్న ఒడిశా ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.



బీజేపీ విస్తృత కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు



సమావేశానికి హాజరైన ప్రతినిధులు

# హైవేపై భారీ ట్యాంకర్ బోల్తా

- ఒడిశా-ఆంధ్రాకు రాకపోకలు బంద్

**కొరాపుట్:** జిల్లా కేంద్రానికి సమీపంలోని దుమ్రిపుట్ వద్ద జాతీయ రహదారి 26పై భారీ సిమెంట్ ట్యాంకర్ బోల్తాపడడంతో ఆంధ్రా-ఒడిశా రాష్ట్రాల మధ్య రాకపోకలకు శుక్రవారం తీవ్ర అంతరాయం ఏర్పడింది. విశాఖపట్నం నుంచి కొరాపుట్ వైపు వస్తున్న ఈ వాహనం వెనుక నుంచి వస్తున్న వాహనానికి దారి ఇవ్వడానికి పక్కకు జరిగే క్రమంలో బోల్తాపడింది. ఈ ఘటనలో వాహనంలో ఉన్న ఇద్దరు డ్రైవర్లు క్షేమంగా బయటపడ్డారు. అయితే రహదారికి అడ్డంగా పడిపోవడంతో వందలాది వాహనాలు నిలిచిపోయాయి. కటక్, భువనేశ్వర్, విశాఖపట్నం, విజయవాడ, బహ్మపుర తదితర ప్రాంతాల నుంచి వస్తున్న రాత్రిపూట బస్సులు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు వర్షం పడుతుండడంతో ప్రయాణికులు బస్సులకే పరిమితమయ్యారు. కొరాపుట్ జిల్లా కేంద్రం నుంచి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, జాతీయ రహదారుల విభాగం సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. సాయంత్రానికి రాకపోకలు పునరుద్ధరించారు. అయితే జాతీయ రహదారుల విభాగం అధికారులు రహదారిపై గోతుల కప్పి ఉంటే ఈ పరిస్థితి తలెత్తేది కాదని విమర్శలు వెల్లువెత్తాయి.



బోల్తాపడిన భారీ వాహనం



రహదారిపై నిలిచిన వందలాది వాహనాలు

# తప్పిన పెను ప్రమాదం

**ఎచ్చెర్ల క్యాంపస్, ఎచ్చెర్ల:** ఇంకొన్ని నిమిషాల్లో ఇంటికి చేరిపోతామనుకున్న ప్రయాణికులను రోడ్డు ప్రమాదం నిలువునా కుదిపేసింది. మరణ భయాన్ని కలిగించి కనికరించి వదిలేసింది. 45 మంది ప్రయాణికులు గల ఆర్టీసీ బస్సు నడిరోడ్డుపై లారీని ఢీకొట్టడంతో ప్రయాణికులంతా ఉలిక్కిపడ్డారు. ఏం జరిగిందో తేరుకునేలోపే తొమ్మిది మంది గాయపడ్డారు. మిగిలిన వారంతా బతికించావురా.. అంటూ దేవుడికి మొక్కుకున్నారు. వివరాల్లోకి వెళితే.. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వస్తున్న ఆర్టీసీ నాన్‌స్టాప్ బస్సు శుక్రవారం జాతీయ రహదారిపై లావేరు మండలం అదపాక సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. బ్రేక్ డౌన్ కారణంగా లారీ అక్కడ నిలిపి ఉంచారు. అదే వాహనాన్ని ఆర్టీసీ బస్సు వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. దీంతో బస్సు ముందు భాగమంతా నుజ్జునుజ్జయిపోయింది. బస్సు డ్రైవర్ సీహెచ్ శ్రీనివాసరావు స్టీరింగ్ వద్ద ఇరుక్కుపోయారు. వెంటనే స్థానిక యువకులు పోలీసులకు సమాచారం అందించి సహాయ చర్యలకు ఉపక్రమించారు. ఎచ్చెర్ల, లావేరు ఎస్‌ఐలు చిరంజీవి, స్వామినాయుడు ఆధ్వర్యంలోని పోలీసులు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. స్టీరింగ్ వద్ద చిక్కుకున్న డ్రైవర్‌ను శ్రమించి బయటకు తీశారు. ఆయన రెండు కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. మరో పక్క ఆగి ఉన్న లారీ టైర్ మరమ్మతులు చేస్తున్న క్లీనర్ గౌతమ్ గాయపడ్డారు. బస్సు ఢీకొట్టినప్పుడు లారీ ముందుకు కదలడంతో లారీ టైరు కింద కాలు ఉండిపోయి గాయాలయ్యాయి. అలాగే బస్సు ముందు సీట్లలో కూర్చున్న ప్రయాణికులు సూర్యప్రకాష్, సూర్యప్రభాకర్, వికాస్, లక్ష్మీనారాయణ, మల్లేసు, రోహిత్, హేమసుందర్‌లు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ఐదుగురు శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. బస్సు డ్రైవర్, లారీ క్లీనర్‌లకు మాత్రం కాళ్లు విరిగిపోయాయి. బస్సులో ఉన్న ప్రయాణికుల్లో 15 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఎవరికీ ప్రాణాపాయ పరిస్థితి లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు సహాయ చర్యలు పర్యవేక్షించారు. లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్ ప్రతినిధులు కూడా సహాయ చర్యల్లో పాల్గొన్నారు. అలాగే బస్సులో ఉన్న ప్రయాణికులను కాంప్లెక్స్‌కు చేర్చే చర్యలు చేపట్టారు. లావేరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# చోరీ కేసు నిందితులు అరెస్టు

**రాయగడ:** ఒక చోరీ కేసుకు సంబంధించి ముగ్గురు నిందితులను చందిలి పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్‌ఫోన్లతో పాటు రూ.23 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైనవారిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా బొగొలి మండలం బిట్రాగుంట గ్రామానికి చెందిన బాణాల జకిరే, పేటల నవీన్, బాణాల రవిలు ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. వారు తెలిపిన వివరాల మేరకు.. చందిలి పోలీసుస్టేషన్ పరిధి అమలాభట్ట గ్రామంలో నివసిస్తున్న ఏకామ్ర మహారణ అనే వ్యక్తి టీపీఎస్‌డీవోఎల్ సంస్థలో (విద్యుత్ విభాగం) లైన్‌మెన్‌గా పని చేస్తున్నాడు. విధుల్లో భాగంగా తన ద్విచక్ర వాహనాన్ని జేకేపూర్‌లోని వేంకటేశ్వర ఆలయం సమీపంలో ఈనెల 9వ తేదీన పార్కింగ్ చేసి, పక్కనే ఉన్నటువంటి ఫ్యూజ్ కాల్ కార్యాలయానికి వెళ్లారు. పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వెళ్లేందుకు వచ్చేసరికి పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం కనిపించలేదు. దీంతో చోరీకి గురైనట్లు భావించిన అతను వెంటనే చందిలి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులను పట్టుకున్నారు. వీరంతా అంతరాష్ట్ర దొంగల ముఠాకు చెందినవారిగా గుర్తించడం జరిగిందని, వాహనాలు నిలిపే సమయంలో దొంగలిస్తుంటారని ఎస్‌డీపీవో సేనాపతి పేర్కొన్నారు.



పోలీసులకు చిక్కిన నిందితులు

# సీట్ల కేటాయింపు పూర్తి

**ఎచ్చెర్ల క్యాంపస్:** శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) ఎస్ ఎం పురం క్యాంపస్‌లో ప్రీ యూనివర్సిటీ కోర్సు (పీయూసీ) రెండేళ్లు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఇంజినీరింగ్ బ్రాంచ్‌ల కేటాయింపు పూర్తిచేశారు. త్వరలో క్లాస్‌వర్క్ ప్రారంభించనున్నారు. 978 మందికి సీట్లు కేటాయించగా, మార్పులు, చేర్పులు కోరుకున్న విద్యార్థులకు ఈ నెల 26న మరోసారి కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. రాష్ట్రంలో నిర్వహిస్తున్న ఇతర క్యాంపస్‌ల్లో సైతం విద్యార్థులు కోరుకునే బ్రాంచ్‌ల్లో ప్రవేశాలు పొందవచ్చు. శ్రీకాకుళం క్యాంపస్‌కు సంబంధించి సివిల్‌లో 95 మంది, మెకానికల్‌లో 39 మంది, ట్రిపుల్‌ఈలో 86 మంది, ఈసీఈలో 344 మంది, సీఎస్‌ఈలో 353 మంది ప్రవేశాలు పొందారు. ఎక్కువగా విద్యార్థులు సీఎస్‌ఈ, ఈసీఈలకు ప్రాధాన్యత ఇచ్చారు. త్వరలో ఇంజినీరింగ్ మొదటి సెమిస్టర్ క్లాస్‌వర్క్ ప్రకటించనున్నట్లు క్యాంపస్ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ తెలిపారు.

## క్లుప్తంగా

### స్వర్ణ పుష్పాలంకరణలో పైడితల్లి



చండీయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

విజయనగరం టౌన్: కోరిన కోర్కెలు తీ ర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు శు క్రవారం స్వర్ణపుష్పాలంకరణలో భక్తుల కు దర్శన మిచ్చారు. ఆలయ ఈఓ డీవీవీ. ప్రసాదరావు ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

**భక్తిశ్రద్ధలతో చండీయాగం**

రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలో శుక్రవారం పైడితల్లి అమ్మవారు చండీయాగాన్ని వేదపం డితులు సాయి, వెలువలపల్లి నరసింహమూర్తి లు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. యాగం విశిష్టతను వే దపండితులు భక్తులకు వివరించారు. కార్యక్ర మంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### జిల్లా జడ్జిని కలిసిన ఎస్పీ



జిల్లా జడ్జి సాయి కల్యాణ్ చక్రవర్తికి పూలమొ క్కను అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: విజయనగరం జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి బి.సాయి కల్యాణ్ చక్రవర్తిని నూతనంగా బాధ్యతలు చేప ట్టిన ఎస్పీ వకుల్ జిందాల్ శుక్రవారం కలిశా రు. ఈ సందర్భంగా జిల్లా న్యాయస్థానంలోని ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా భేటీ అయి పూలమొక్కను అందజేశారు. అనంత రం పలు విషయాలపై వారిద్దరూ చర్చించారు.

### ఏడాదిలో 50 బాల్యవివాహాలకు అడ్డుకట్ట

విజయనగరం: గడిచిన ఏడాది కాలంలో విజయనగరం జిల్లాలోని వివిధ ప్రాం తాల్లో 50 బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేసి నట్లు బెజ్జిపురం యూత్ క్లబ్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.ప్రసాదరావు తెలిపారు. ఈ మేరకు విజయ నగరంలో ఆయన మాట్లాడారు. ఇండియా చైల్డ్ ప్రొటెక్షన్, బెజ్జిపురం యూత్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో బాల్య వివాహ రహిత సమాజ నిర్మాణం కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు. బాల్య వివాహాల నియంత్రణలో తీసుకోవాల్సిన అం శాలపై ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు లు ఏర్పాటు చేయడం ద్వారా పెండింగ్ కేసు లను పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా తల్లిదండ్రులు, సంరక్షకులు బాల్య వివాహాలు చేస్తే చట్టపరంగా తీసుకునే చర్యలపై పం చాయతీల్లోని సభ్యులకు తొలుత అవగాహన కల్పించాలని సూచించారు.


### బాల గంధర్వల ఎంపికకు సర్వం సిద్ధం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఘంటసాల కళాపీఠం వ్యవస్థాపకుడు ఎం.భీష్మారావు, తదితరులు

విజయనగరం టౌన్: 'బాల గంధర్వ' పేరుతో 14 ఏళ్లలోపు బాల, బాలికలకు గాత్రం, ప్యాడ్స్, కీబోర్డు , డ్రమ్స్ వంటి వాటిపై ఉచితంగా శిక్షణ ఇచ్చి నవం బరు 14న బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని వారితో సంగీత స్వరఝరి నిర్వహిస్తున్నామని ఘంటసాల స్మారక కళాపీఠం వ్యవస్థాపకుడు ఎం .భీష్మారావు పేర్కొన్నారు. స్థానిక శిక్షణాలయంలో శుక్రవారం ఆయన ఈ మేరకు ఎంపిక కరపత్రా లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఈ నెల 21న ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ ఆడిషన్స్ నిర్వహిస్తు న్నామని పేర్కొన్నారు. బాల, బాలికల తల్లిదండ్రు లు నేరుగా శిక్షణాలయానికి వచ్చి వారిపేర్లను నమోదుచేసుకోవచ్చని సూచించారు. నేరుగా వచ్చే అవకాశం లేనివారు ఫోన్ 9440270594, 9908410884 నంబర్లను సంప్రదించాలని సూచిం చారు. బాల, బాలికలకు పూర్తిగా ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నామని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాపీఠం ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

### బాధ్యతల స్వీకరణ



జేఎన్‌టీయూ జీవీ వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయ నగరం (జీవీ) ఇన్‌చార్జి వీసీగా ప్రొఫెసర్ డి.రా జ్యలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జ యసుమ, ఇంజినీరింగ్ కళా శాల ప్రొఫెసర్ కె.శ్రీకుమార్, వివిధ విభాగాల డైరెక్టర్లు, వైస్ ప్రిన్సిపాల్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జా మినేషన్స్ వివిధ విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, అనుబంధ కళాశా లల యాజమాన్యాలు, విద్యార్థులు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలి పారు. అనంతరం బోధన, బోధనేతర సిబ్బం దితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లా డుతూ వర్సిటీ అభివృద్ధికి కలిసికట్టుగా కృషిచే ద్దామన్నారు.

# అతిసారపై అప్రమత్తం

- ప్రతి ఏడాదీ డయేరియాతో 5.8శాతం మరణాలు
- వైద్యశాఖను అలర్ట్ చేసిన ఆర్‌జేఐ
- రెండు నెలల పాటు ప్రత్యేక డ్రైవ్
- ఫలితాల దిశగా అవగాహన కార్యక్రమాలు



గ్రామాల్లో ముందస్తుగా క్లోరినేషన్

**జిల్లాలో నమోదైన డయేరియా కేసులు**

| సంవత్సరం | డయేరియా బాధితులు | మరణాలు |
|---|---|---|
| 2022-23 | 1814 | 0 |
| 2023-24 | 1254 | 0 |
| 2024- 25 | 398(ఇప్పటివరకూ) | 0 |



రాజాం పట్టణంలోని గాయత్రి కాలనీలో స్టాప్ డయేరియా ర్యాలీలో మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు, వైద్యసిబ్బంది



ఏరియా ఆస్పత్రిలో డయేరియా పేషెంట్ల వార్డు

రాజాం: వర్షాకాలంలో వచ్చే ప్రమాదకర వ్యాధుల్లో డయేరియా ఒకటి. చాలా మంది చిన్నారులకు అతిసార వ్యాధి మృత్యువు ముప్పును తెచ్చిపెడు తోంది. ముందస్తు జాగ్రత్తలతో మాత్రమే అతిసార వ్యాధి నుంచి బయటపడే అవకాశం ఉంది. కాదని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రాణాల మీదకి రానుంది. ఈ వ్యాధితో ప్రతి ఏటా బాలల్లో 5.8 శాతం మర ణాలు సంభవిస్తున్నాయని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా వెల్లడించింది.

**స్టాప్ డయేరియాతో అలర్ట్..**

అతిసార వ్యాధి పట్ల విజయనగరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తం అయింది. ఈ మేరకు బాల ల్లో అతిసార మరణాలను పూర్తిగా నివారించేందుకు స్టాప్ డయేరియా కార్యక్రమం ప్రారంభించింది. పట్టణ ప్రాంతాలు, మున్సిపాల్టీల్లోని వార్డులతో పాటు గ్రామాల్లోని మారుమూల ప్రాంతాలు, జనావాసాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. క్షేత్రస్థాయిలో ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆరోగ్య కార్యదర్శులు, మిడ్‌లెవెల్ హెల్త్ వర్కర్లతో పాటు వివిధ హోదాల్లో పనిచేస్తున్న వైద్యసిబ్బంది ఈ కార్యక్రమంలో తలామునకలయ్యారు. ఆయా ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు, మండలపరిషత్ అధికారులు, తహసీల్దార్‌లను కూడా ఇందులో భాగస్వామ్యం చేస్తూ వారి సేవలు తీసుకుంటు న్నారు. డయేరియా వ్యాప్తిచేసే కీటకాల నివారణకు ముందస్తుగానే గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు, వ్యాధులు వ్యాప్తిచేసే క్రిములను సంహరించే టెక్ని కల్ మలాథియాన్ ద్రావణాలను స్ప్రే చేయడం, క్లోరినేషన్ చేయించడం, బ్లీచింగ్ చల్లి శుభ్రం చేస్తు న్నారు.

**జిల్లాలో అంతంత మాత్రమే**

జిల్లాలో గడిచిన రెండేళ్లలో అతిసార కేసులు అం తంత మాత్రంగానే నమోదయ్యాయి. ఒక్క డయే రియా మరణం కూడా లేకపోవడం విశేషం. గత ప్రభుత్వం అమలుచేసిన ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్య సురక్ష లాంటి కార్యక్రమాలు ఫలితాలు ఇచ్చాయి. గ్రామ స్థాయి నుంచి పెద్దాస్పత్రులకు వచ్చే ప్రమా దకర డయేరియా వంటి వ్యాధులు క్షేత్ర స్థాయిలో కనిపించలేదు. సీజనల్ జ్వరాలను కూడా కట్టడిచే శారు.

**పేరు మార్పి**

జాతీయ ఆరోగ్య సంస్థ పర్యవేక్షణలో ప్రతి ఏడాది 15 రోజుల పాటు ఇంటెన్సిఫైడ్ డయేరియా కం ట్రోల్ ఫోర్ట్‌నైట్(ఐడీసీఎఫ్) నిర్వహించి అవగాహన కల్పించేవారు. ఇప్పుడు ఈ కార్యక్రమాన్ని ఈ ఏడాది ఇంటెన్సిఫైడ్ డయేరియా కంట్రోల్ ప్రోగ్రాం గా మార్చారు. దీనినే స్టాప్ డయేరియా క్యాం పెయిన్-2024గా పిలుస్తున్నారు. పెరుగుతున్న కేసులు, ప్రభావితమవుతున్న బాలల భద్రతకోసం ఏటా రెండు నెలల పాటు ఏడు శాఖల భాగస్వా మ్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ, మహిళ, శిశు సంక్షే మశాఖ, తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ విభాగం, పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్, విద్యాశాఖ, ఆహార భద్రతా విభాగాలు ఈ ఏడాది స్టాప్ డయే రియాపై సమన్వయంతో పనిచేస్తున్నాయి. రెండు నెలల పాటు మూడు దశల్లో ఈ కార్యక్రమం నిర్వ హిస్తారు. అంగన్వాడీ కేంద్రాలు, వైద్య ఆరోగ్యశాఖ విలేజ్ క్లినిక్‌లు కార్యక్రమంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి.

**చిన్నారులపై ప్రత్యేక దృష్టి..**

రెండునెలల లోపు చిన్నారులకు అతిసార నివార ణకు ఎటువంటి ద్రావణాలు ఇవ్వరు. వారు తల్లిపాలమీదే ఆధారపడి ఉండాలి. తల్లిపాలు తాగిన బిడ్డకు ఏమీ కాదన్నది శాస్త్రీయ నిరూపణ. రెండు నుంచి ఆరునెలలు మధ్య వయస్సు ఉన్న చిన్నారులకు ఓఆర్ఎస్, జింక్ మాత్రలు 14 రోజుల పాటు ఇస్తారు. ఆరు నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, అంగన్వాడీ కార్యకర్తలు ఓఆర్ఎస్‌తో పాటు 20 గ్రాముల జింక్ మాత్రలను 14 రోజుల పాటు ఇస్తారు. ప్రధానంగా ఈ వర్షాకాలంలో అతిసార బారిన పడకుండా చంటిపిల్లల్ని కంటికి రెప్పలా కాపాడుకోవాలి.

**రెండు నెలల కార్యక్రమం..**

స్టాప్ డయేరియా రెండు నెలల కార్యక్రమంగా జిల్లాలో నిర్వహిస్తున్నాం. ఈనెల 1న ప్రారంభ మైన ఈ కార్యక్రమం ఆగస్టు నెలాఖరువరకూ ఉం టుంది. రెండు నెలల్లో మొదటి 14 రోజులు అవ గాహన కార్యక్రమాలు గ్రామాల్లో నిర్వహించాం. రెండో దశలో నెలరోజుల పాటు గ్రామాల్లో, ర్యాలీ చేపట్టి, గ్రామాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వ హిస్తున్నాం. మూడో దశలో మిగిలిన 16 రోజులు ఇంటింటి ప్రచారాలు, సర్వేలు, వ్యక్తిగత పరిశు భ్రత, ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన వంటి కార్యక్రమాలు చేయనున్నాం. ఇప్పుడు గ్రామాల్లో ఐదేళ్లలోపు చిన్నారులందరికీ ఓఆర్ఎస్ ద్రావణం, జింక్ మాత్రలు అందించనున్నాం. ఐసీడీఎస్ ఉద్యోగులు చిన్నారుల గ్రోత్‌ను పరిశీలించడం, న్యూట్రీషియన్ అసెస్మెంట్, పోషకాహార లోపం ఉన్న చిన్నారులను గుర్తించడం చేస్తున్నారు. గ్రామ స్థాయిలో అంగన్వాడీ కేంద్రాలు, ఆరోగ్య సంరక్షణ కేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ద్రావణం అందించే ఏర్పాట్లు చేశాం. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల వద్ద నీటి నాణ్యత పరీక్షకు తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ ఏడాది జిల్లాలో డయేరియా ప్రమాదాలు లేకుండా చర్యలు చేపడుతున్నాం.

ఎస్.భాస్కరరావు,
జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, విజయనగరం

# విద్యుత్ ప్రమాదాల పట్ల జాగ్రత్త

- ఎస్ఈ లక్ష్మణరావు



విద్యుత్‌శాఖ ఎస్ఈ లక్ష్మణరావు

విజయనగరం ఫోర్ట్: వినియోగదారులు విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ ఎస్ఈ మువ్వల లక్ష్మణరావు కోరారు. వర్షా కాలంలో విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరిగే ఆస్కారం ఉందని, ఇంటిలోపల స్విచ్ బోర్డులకు భద్రతా ప్రమాణాలు పాటిస్తూ తగినంత ఎత్తులో అమర్చుకోవాలని సూచించారు. విద్యుత్ సర్వీస్ కోసం సర్వీసు వైరు నాణ్యమైన లోడుకు అనుగు ణంగా తగిని కెపాసిటీ వాడినట్లయితే విద్యుత్ సర ఫరాలో అంతరాయాలను, లోవోల్టేజ్ హెచ్చు తగ్గు లను నివారించవచ్చని చెప్పారు. ప్రతి ఇంటి విద్యుత్ సర్వీసుకు , ఇంటిలో ఉపయోగించే పరిక రాలకు తప్పనిసరిగా ఎర్త్ పైపుల ద్వారా ఎర్త్‌గేరు ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించవచ్చున న్నారు. వర్షం పడుతున్నప్పుడు విద్యుత్ వైర్లు, స్టే వైర్లు ముట్టుకోరాదన్నారు. ఇల్లు, ఇతర నిర్మాణాలు జరుగుతున్నప్పుడు దగ్గరలో విద్యుత్ వైర్లు , విద్యుత్ స్తం భాలు ఉంటే విద్యుత్‌శాఖ సిబ్బందికి తెలియజేసి విద్యుత్ సంస్థ ప్రామాణిక నిబంధనలు ప్రకారం తగిన దూరం తగిన దూరం పాటించి నిర్మాణాలు పాటిం చాలని సూచించారు. చేతులు, కాళ్లు తడిగా ఉన్న ప్పుడు కరెంట్ స్విచ్‌లను వేయరాదన్నారు. విద్యు త్‌కు సంబంధించిన సమస్యల పరిష్కారాం కోసం సంబంధిత విద్యుత్‌శాఖ సిబ్బందిని మాత్రమే సం ప్రదించాలని, ఇతర ప్రైవేట్ వ్యక్తులను సంప్రదించ రాదని తెలిపారు. తోటల్లో కానీ, పొలాల్లో కానీ, ఇతర ప్రదేశాల్లోనైనా విద్యుత్ ప్రసారం జరిగే తీగ లు తెగి పడి ఉంటే వాటిని నేరుగా తాకరాదని, వెం టనే విద్యుత్‌శాఖ సిబ్బందికి గానీ, ట్రోల్ ఫ్రీ 1912 నంబర్‌కు గాని తెలియజేయాలని కోరారు.

# ‘రాకెట్’ స్పీడ్‌లో క్రీడాకారులు



తొలిరోజు విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు

- కొనసాగిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు
- రెండవ రోజు అండర్-15,17 విభాగాల్లో మ్యాచ్‌లు

విజయనగరం: రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించాలన్న పట్టుదలతో క్రీడాకారు లు చూపిస్తున్న ప్రతిభతో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. జిల్లా కేంద్రంలో నాలుగు రోజుల పాటు నిర్వహించతలపెట్టిన పోటీల్లో భాగంగా శుక్రవారం అండర్-15,17 విభాగాల్లో బాల, బాలికలకు సింగిల్స్, డబుల్స్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 120 మంది క్రీడాకారు లు హాజరు కాగా..పోటీలు ఆద్యంతం ఉత్కంఠభ రితంగా జరిగాయి. పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేయడంతో పాటు త్వరలో రాష్ట్ర స్థాయి లో జరగనున్న పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం కల్పించనున్నారు.

**అండర్-11,13 విభాగాల్లో విజేతలు వీరే..**

జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్న జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో భాగంగా అండర్-11,13 విభాగాల్లో తొలిరోజు గురువారం జరిగిన పోటీల్లో విజేతలకు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కేపీనాయుడు, సీనియర్ ఉపాధ్యక్షుడు డాక్టర్ వీఎస్ ప్రసాద్‌లు శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు. అండర్-11 బాలుర సింగిల్స్ విభాగంలో జి.హర్షవర్ధన్, పి.జోషిత్‌కృష్ణలు మొదటి రెండు స్థానాలు, డబుల్స్ విభాగంలో ఎస్.యశోవర్ధన్-కె.చార్విక్‌ల జట్టు మొదటిస్థానం, ఎం.మనోజ్‌కు మార్-జి.సృజన్‌ల జట్టు ద్వితీయ సానం దక్కించు కుంది. అలాగే అండర్-11 బాలికల సింగిల్స్ విభాగంలో పి.జోష్నికశ్రీ, ఎన్.రోహితశాన్విలు మొదటి రెండు స్థానాల్లో నిలంగా డబుల్స్ విభాగం లో ఎన్.రోహిత శాన్వి-పి.జోష్నికశ్రీ జట్టు, ఎం.లితిక-కె.జాశ్వితల జట్టు ప్రథమ, ద్వితీయ స్థానాలు దక్కించుకున్నాయి. అండర్-13 బాలుర విభాగంలో జి.నవనీత్, ఎస్.లిఖిత్‌లు ప్రథమ, ద్వితీయ స్థానాలు, డబుల్స్ విభాగంలో ఎస్.లిఖిత్-టి.పుష్పక్‌ల జట్టు, పి.జోషిత్‌కృష్ణ-పి.ఎస్.రెడ్డిల జట్లు వరుస విజేతలుగా నిలిచాయి. అదేవిధంగా బాలికల విభాగంలో ఎస్.లాస్యశ్రీ, ఎం .డి.నిషద్ ఫాతిమా మొదటి, రెండు స్థానాలు, డబుల్స్ విభాగంలో ఎస్.లాస్యశ్రీ-ఎండి.నిషద్ ఫాతిమా జట్టు, పి.భవ్యశ్రీ-ఎం.లితిక్ష జట్టు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. పోటీలను అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నున్న సురేష్, వై.కుసుంబచ్చన్, పొట్నూరు శ్రీరాములు తదితరు లు పర్యవేక్షించారు.



రెండో రోజు జరిగిన పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

# గర్భిణులు ఆస్పత్రిలోనే ప్రసవించాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్



నోంద్రుకోనలో గర్భిణులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

గుమ్మలక్ష్మీపురం: మారుమూల గ్రామాల్లోని గర్భిణులు రిస్క్ తీసుకోకుండా ప్రసవానికి ముందు గానే గర్భిణుల వసతిగృహంలో చేరాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన గుమ్మలక్ష్మీపురం మండలంలోని మారు మూల గ్రామాలైన నోంద్రుకోనతో పాటు పెంగవ, రేగిడిలో పర్యటించారు. ఈ సందర్భంగా నోంద్రు కోన గ్రామస్తులు కలెక్టర్‌కు గిరిజన సంప్రదాయ బద్ధంగా ఆహ్వానం పలికారు. ఈ పర్యటనలో ఆయన ప్రజలకు అందుతున్న వివిధ పథకాలు, వాటి అమలు తీరును తనిఖీ చేశారు. పారిశుధ్యం, వైద్య శిబిరం, అంగన్వాడీ కేంద్రం, వ్యవసాయ పనులు, పాఠశాల, మంచినీటి సరఫరాను పరిశీలిం చారు. నోంద్రుకోనలో ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరంలో గర్భిణులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు ఆస్పత్రుల్లోనే ప్రసవించాలని, రిస్క్ తీసుకోకుండా ప్రసవం తేదీకి ముందుగానే వసతి గృహంలో చేరాలని సూచించారు. రక్తహీనత రాకుండా అంగ న్వాడీ ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా వినియోగించుకోవాలని హితవు పలికారు. అనం తరం గ్రామంలో నిర్వహించిన పారిశుద్ధ్య వారోత్స వాల కార్యక్రమంలో పాల్గొని పలువురు గిరిజను లకు దోమ తెరలను పంపిణీ చేశారు. ప్రజలకు సురక్షితమైన మంచి నీటిని అందించి, డయేరియా, నీరు, క్రిముల ద్వారా సంక్రమించే వ్యాధులు సంభ వించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులు చేపడుతున్న పొలం పను లను పరిశీలించి పంపిణీ చేసిన విత్తనాల గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలను సందర్శించి విద్యార్థులకు చక్కని విద్యను అందివ్వాలని, పాటల రూపంలో పాఠ్యాంశాలను నేర్పించాలని, ఉపా ధ్యాయులకు సూచించారు. పర్యటనలో కలెక్టర్ వెం ట ఐటీడీఏ పీఓ సి.విష్ణు చరణ్, డిప్యూటీ డీఎంహె చ్ఓ శివకుమార్, డీఎంఓ డాక్టర్ టి.జగన్‌మోహన్ రావు, తహసీల్దార్ రామారావు, ఎంపీడీఓ రమేష్ బాబు తదితరులు ఉన్నారు.

# బాలుడికి డెంగీ

సీతంపేట: పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఏజెన్సీలోని కిండంగి గ్రామంలో సవర ప్రదీప్ అనే ఎనిమిదేళ్ల బాలుడికి డెంగీ పాజిటివ్ వచ్చింది. దీం తో అధికారులు స్పందించి గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే చేశారు.
దోమల నివారణ మందు స్ప్రేయింగ్, ఫాగింగ్ నిర్వ హించారు. ప్రత్యేకాధికారి సింహాచలం, ఎంపీడీవో గీతాంజలి, మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ జె.మోహన్‌రావు తదితరులు కార్యక్రమంలో పాల్గొ న్నారు.

# వైభవంగా సహస్ర దీపాలంకరణ



సీతారామస్వామికి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం లోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన పూజలు నిర్వహించిన తరువాత యాగశాలలో నిత్య హోమా లు, వెండి మంటపం వద్ద స్వామి కల్యాణ మహో త్సవాన్ని వైభవంగా జరిపించారు. సాయంత్రం 6 గంటలకు సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా దీపారాధన మంటపంపైకి తీసుకువ చ్చి ప్రత్యేక ఊయలలో ఆసీనులను చేశారు. అనం తరం దీపాలు వెలిగించి ఊంజల్ సేవ జరిపిం చారు. కార్యక్రమంలో అర్చకులు కిరణ్, నరిసిం హాచార్యులు, పవన్, భక్తులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చి దిద్దుదాం



అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

పార్వతీపురం: జాయింట్ యాక్షన్ ప్లాన్ ద్వారా ప్రభుత్వ శాఖల సహాయ సహకారాలు, సమ న్వయం, ఉమ్మడి భాగస్వామ్యంతో జిల్లాను డ్రగ్స్ రహితంగా తీర్చి దిద్దడానికి విస్తృత చర్యలు తీసు కుంటున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, జిల్లా మహిళా శిశు సం క్షేమశాఖ సారధ్యంలో బాలల మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నియంత్రణ చర్యల గురించి జిల్లా లో బాలలతో పనిచేస్తున్న కీలక ముఖ్య శాఖలైన బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, పోలీసుశాఖ, విద్యాశాఖ, ఎక్సైజ్‌శాఖ, సాంఘిక సంక్షేమశాఖ, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖ, సమాచార, పౌర సంబంధాల శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, రైల్వే తదితర శాఖలకు సంబంధించి ఉన్నతాధికారులతో జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడు ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో జిల్లాలో డ్రగ్స్ నియంత్రణ కోసం చేపడుతున్న కార్యక్రమా లపై వివిధ శాఖల అధికారులను అడిగి పూర్తి సమా చారం తెలుసుకున్నారు. అలాగే చేపట్టవలసిన నియంత్రణ చర్యలను వివరించారు. ఈ సందర్భం గా మెడికల్ షాప్స్, మద్యం దుకాణాలలో తప్ప నిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సమాచార పౌర సంబంధాల శాఖాధి కారులు ఎల్కక్ట్రానిక్, ప్రింట్ మీడియా ద్వారా మాదక ద్రవ్యాల వినియోగంవల్ల పిల్లల భవిష్యత్ ఏ విధంగా ఛిద్రం అవుతుందో డాక్యుమెంటరీల రూపంలో విస్తృత ప్రచారం చేపట్టాలని సూచిస్తు న్నట్లు తెలిపారు. ఈ సమీక్షలో గుర్తించిన అంశా లపై మళ్లీ వంద రోజుల తరువాత పురోగతిపై చర్చించనున్నట్లు తెలిపారు.

**'వీధి బాలల గుర్తింపు లేదా..?**

జిల్లాలో వీధి, యాచక పిల్లలు ఎంతమంది ఉన్నా రని ఐసీడీఎస్ పథక సంచాలకులు ఎంఎన్. రాణిని కమిషన్ ప్రశ్నించింది. ఒక్కరూ కూడా లేరని ఐసీడీ ఎస్ పీడీ బదులివ్వడంతో విస్మయం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని మిగిలిన 25 జిల్లాల్లోను యాచక వీధి బాలలు అడుగడుగునా కన్పిస్తుంటారని ఈ జిల్లా లో ఒక్కరూ కూడా లేరని చెప్పడం ఆశ్చర్యం కలిగిస్తోందని కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. బస్టాండ్, రైల్వేస్టేషన్లలలో యథేచ్ఛగా యాచక బాలలు ఉంటున్నారని, దీన్ని బట్టి మీ పనితీరు ఎలా ఉంటోందో అర్థమవుతోందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని మిగిలిన జిల్లా లతో పోల్చుకుంటే మన్యం జిల్లా ఐసీడీఎస్ శాఖపైనే ఎక్కువగా ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు.

సమావేశంలో ఐసీడీఎస్ పీడీ ఎంఎన్. రాణి, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎ.సత్యనారాయణ, పాలకొండ డీఎస్పీ జీవీ. కృష్ణారావు, డీపీఓ బలివాడ సత్యనారాయణ, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యం నాయుడు, జెడ్పీ సీఈఓ రాజ్ కుమార్, ఐటీడీఏ డీడీ ఎం.రుక్మాంగదయ్య, జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అధికారి ఎం.డి.గయాజుద్దీన్, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ఎస్.కృష్ణ, జిల్లా కార్మిక శాఖ అధికారి కె.రామకృష్ణా రావు, ఎస్ఈబీ, ఎక్సైజ్, జిల్లా పరిషత్, విద్యాశాఖ, ఆరోగ్య, మునిసిపల్, సమా చార పౌర సంబంధాల, రైల్వే, ఆర్టీసీ, సాంఘిక సం క్షేమ శాఖ, అటవీశాఖ అధికారులతోపాటు, నీడ్, ఐఆర్‌పీడబ్ల్యూ తదితర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి

- సాక్షి వరుస కథనాలపై స్పందించిన కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: జిల్లాలోని బొబ్బిలి, కొత్తవ లస, డెంకాడ మండలాల్లోని ఇసుక స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక అక్రమ తరలింపును తక్షణమే అరి కట్టాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణాపై సాక్షి ప్రచురిం చిన వరుస కథనాలపై ఆయన స్పందించారు. తన చాంబర్‌లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి కమిటీ సభ్యులంతా క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను వెంటనే సీజ్ చేయాలని రవాణా అధికా రులకు ఆదేశించారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని మైన్స్ డీడీకు సూచించారు. పోలీస్, రెవెన్యూ, మైన్స్, రవాణా శాఖల అధికారులు స్టాక్ యార్డులలో మూకమ్మడిగా తనిఖీలు చేయాలన్నారు. ఉచిత ఇసుక పేరుతో అధిక డబ్బులు వసూలు చేస్తున్న వారిపై నిఘా పెట్టాలన్నారు. సమావేశంలో జేసీ కార్తీక్, ఆర్డీఓలు సూర్యకళ, శాంతి, సాయిశ్రీ, అదనపు ఎస్పీ అస్మాఫర్హీన్, పీసీబీ ఈఈ సరిత, మైన్స్ డీడీ సూర్యచం ద్రరావు, భూగర్భ జలశాఖ డీడీ దుర్గాప్రసాద్, ట్రాన్స్ పోర్ట్, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

# సెంచూరియన్‌లో బూట్ క్యాంప్



బూట్ క్యాంపులో వీసీ ప్రొఫెసర్ పీకే మహంతి, రిజిస్ట్రార్ పల్లవి, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూ రియన్ విశ్వ విద్యాలయంలో ఇంజినీరింగ్ విద్యార్థు లకు బూట్ క్యాంప్‌ను వీసీ ప్రశాంత కుమార్ మహంతి శుక్రవారం ప్రారంభించారు. వర్సిటీలో ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులకు ఈ క్యాంపు ద్వారా పారిశ్రామిక ప్రాజెక్టులకు సంబంధించిన సమస్యల పరిష్కారం చూపనున్నారు. వాటిలో చం ద్రయాన్, రోబోటిక్స్ అప్లికేషన్లు, తదితర ప్రాజెక్టు లను చేపడుతున్నారు. మూడు రోజుల పాటు కొన సాగే ఈ బూట్ క్యాంప్ వల్ల విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీయడానికి అవకాశం ఉం టుందని వీసీ అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డీన్‌లు సన్నీడియోల్, పీఎస్వీ రమణారావు, తదితరులు పాల్గొన్నారు.